42వేల కోట్లు రైటాఫ్

6 నెలల్లో ప్రభుత్వ బ్యాంకులు వదిలించుకున్న రుణాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి 6 నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ రూ.42,035 కోట్లుగా ఉన్నది. ఈ మేరకు సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ప్రకటించారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అత్యధికంగా రూ.8,312 కోట్ల రుణాలను ఖాతా పుస్తకాల నుంచి తొలగించిందని లోక్‌సభలో ఓ లిఖితపూర్వక సమాధానంలో మంత్రి పేర్కొన్నారు. ఆ తర్వాత స్థానాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (రూ.8,061 కోట్లు), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.6,344 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.5,925 కోట్లు) ఉన్నాయన్నారు. కాగా, 'రైటాఫ్ అంటే రుణాల రద్దు కాదు. కాబట్టి దీనివల్ల రుణగ్రహీతకు వచ్చే లాభమేమీ ఉండబోదు. రుణాలు తీసుకున్నవారు బ్యాంకులకు బకాయిపడే ఉంటారు. ఆ మొండి బాకీల వసూలుకు బ్యాంకులు రకరకాల పద్ధతుల్లో ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాయి' అని మంత్రి పంకజ్ చౌధరి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇదిలావుంటే ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో వసూలు చేసిన బకాయిల విలువ రూ.37,253 కోట్లుగా ఉన్నట్టు కూడా ఆయన తెలిపారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ప్రభుత్వ రంగ బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ రూ.1.14 లక్షల కోట్లుగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది రూ.1.18 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. దీంతో రెండున్నరేండ్లలో ప్రభుత్వ బ్యాంకుల లోన్ రైటాఫ్‌లు రూ.2.74 లక్షల కోట్లపైనేనని తెలుస్తున్నది. వీటిలో ఎక్కువ కార్పొరేట్ల రుణాలే ఉండటం గమనార్హం.

ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

రెవెన్యూ కార్యదర్శిని నియమించిన కేంద్రం

పేరు	: సంజయ్ మల్హోత్రా
వయసు	: 56 ఏండ్లు
చదువు	: ఐఏఎస్ (1990 బ్యాచ్ రాజస్థాన్ కేడర్)
అనుభవం	: 33 ఏండ్లు
ప్రస్తుత హోదా:	కేంద్ర రెవెన్యూ కార్యదర్శి

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి, రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాను సోమవారం కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆర్బీఐకి ఈయన 26వ గవర్నర్ కానున్నారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారం (డిసెంబర్ 10)తో ముగుస్తున్నది. ఈ క్రమంలోనే ఆయన స్థానంలోకి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తున్న సంజయ్ మల్హోత్రాను మోదీ సర్కారు తీసుకొచ్చింది. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ లైన్‌క్లియర్ చేసింది. బుధవారం (డిసెంబర్ 11) నుంచి మూడేండ్లపాటు ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతల్ని నిర్వర్తించనున్నారు. ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్‌ను పూర్తిచేసిన సంజయ్ మల్హోత్రా.. అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని సైతం పొందారు.

33 ఏండ్లలో..

33 ఏండ్ల తన కెరియర్‌లో ఎన్నో ప్రభుత్వ రంగ శాఖల్లో మరెన్నో బాధ్యతల్ని మల్హోత్రా నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. విద్యుత్తు, ఆర్థిక, పన్నులు, ఐటీ, గనులు తదితర రంగాల్లో సమర్థవంతంగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తుండగా, అంతకుముందు ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు. ముఖ్యంగా ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరించారు.

నేడు దాస్ పదవీ విరమణ

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. రిజర్వ్ బ్యాంక్ 25వ గవర్నర్‌గా 6 ఏండ్లు పనిచేసిన ఆయన.. అప్పటి గవర్నర్ ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతో 2018 డిసెంబర్ 12న ఈ పదవిలోకి వచ్చారు. 1980 తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. కేంద్ర ఆర్థిక శాఖలోని వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ క్రమంలోనే 8 కేంద్ర బడ్జెట్లలో భాగస్వాములయ్యారు. ఇక అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్‌లో రెండుసార్లు టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా దాస్ అగ్రస్థానాల్లో నిలవడం విశేషం.

కేంద్రానికి దన్నుగా..

గవర్నర్‌గా ఊర్జిత్ పటేల్ వైఖరితో ఆర్బీఐ-కేంద్రం మధ్య దూరం పెరిగిన వేళ దాస్‌ను మోదీ సర్కారు తీసుకొచ్చింది. నిజానికి అప్పటికే దాస్ రిటైరైపోయారు. ఈ క్రమంలో తనపై కేంద్ర పెద్దలు పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటికప్పుడు నిలబెట్టుకుంటూపోయిన దాస్.. ఆర్బీఐ మిగులు నగదు నిల్వలను కేంద్ర ఖజానాకు తరలించడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకున్నది. అంతేగాక ఏటా కేంద్రానికి భారీగా డివిడెండ్లనూ అందించారు. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఏకంగా మునుపెన్నడూలేనివిధంగా రూ. 2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను అప్పజెప్పారు. నిజానికి వీటిని వ్యతిరేకించే నాడు ఆర్బీఐ గవర్నర్ పదవికి పటేల్ రాజీనామా చేయడం గమనార్హం. ఇక కరోనా సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించడం, ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు అంతే స్థాయిలో పెంచడం, వృద్ధి-ధరల మధ్య సమన్వయం కోసం సుదీర్ఘకాలం వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచడం దాస్‌కే చెల్లింది. 2016లో పాత పెద్ద నోట్ల రద్దు అంశంలోనూ నాటి ఆర్బీఐ గవర్నర్ పటేల్ కంటే దాసే కీలక పాత్ర పోషించడం విశేషం.

రూపాయి.. బెంబేలు

చారిత్రక కనిష్ఠ స్థాయి 84.86కి విలువ

ముంబై, డిసెంబర్ 9: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతోపాటు దేశీయ ఈక్విటీలు కుదేలవడంతో కరెన్సీ విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో సోమవారం ఒకేరోజు 20 పైసలు నష్టపోయి నెల కనిష్ఠ స్థాయిని 84.86ని తాకింది. మునుపెన్నడు లేని స్థాయికి పతనమైనట్లు అయింది. డాలర్‌కు అనూహ్యంగా దిగుమతిదారుల, విదేశీ బ్యాంకుల నుంచి డిమాండ్ నెలకొనడంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.70 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 84.86 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరకు ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి కరెన్సీ విలువపై 20 పైసలు కోల్పోయి 84.86 వద్ద ముగిసింది. గత శుక్రవారం 5 పైసలు పెరిగి 84.66 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఈ నెల 4న చారిత్రక కనిష్ఠ స్థాయి 84.75ని తాకిన విషయం తెలిసిందే. రూపాయి పతనంతో భారత్ దిగుమతులపై అధికంగా చెల్లింపులు జరుపాల్సి ఉంటుంది.

రోజూ 10 లక్షల స్పామర్స్

గుర్తించిన ఎయిర్‌టెల్ ఏఐ నెట్‌వర్క్

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: తమ కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత స్పామ్ ఫిల్టర్.. రోజూ 10 లక్షల స్పామర్స్‌ను గుర్తించినట్టు సోమవారం భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఇక గత రెండున్నర నెలల్లో 800 కోట్ల స్పామ్ కాల్స్‌ను, 80 కోట్ల ఎస్ఎంఎస్‌లను కూడా గుర్తించినట్టు ఈ దేశీయ ప్రైవేట్ రంగ టెలికం సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. దీంతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌పై వచ్చిన కాల్స్‌లో 6 శాతం, ఎస్ఎంఎస్‌ల్లో 2 శాతం స్పామర్లు చేసినవేనని తేలింది. స్పామ్ కాల్స్ చేసింది, అందుకున్నది రెండింటిలోనూ ఢిల్లీ అగ్ర స్థానంలో ఉన్నట్టు సంస్థ వెల్లడించింది. ఢిల్లీ తర్వాత ఏపీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ యూజర్లు స్పామ్ కాల్స్‌ను అధికంగా అందుకున్నారు. ఢిల్లీ తర్వాత ముంబై, కర్నాటకల నుంచి స్పామ్ కాల్స్ ఎక్కువగా వెళ్లాయి. అలాగే ల్యాండ్‌లైన్ ఫోన్ల నుంచే స్పామ్ కాల్స్ అధికంగా వస్తున్నట్టు కనిపెట్టారు. ఎస్ఎంఎస్‌ల విషయానికొస్తే.. గుజరాత్, కోల్‌కతా, యూపీల నుంచి ఎక్కువగా వచ్చాయి. ముంబై, చెన్నై, గుజరాత్ వాసులే లక్ష్యంగా ఇవి వెళ్లాయి. పురుష వినియోగదారులే లక్ష్యంగా 76 శాతం స్పామ్ కాల్స్ వచ్చాయి. ఈ ఏఐ పవర్డ్ సొల్యూషన్‌ను రెండున్నర నెలల క్రితమే ఎయిర్‌టెల్ అందుబాటులోకి తెచ్చింది. కాగా, దీంతో భారతీయ తొలి స్పామ్ ఫైటింగ్ నెట్‌వర్క్‌గా భారతీ ఎయిర్‌టెల్ నిలిచింది. మొబైల్ వినియోగదారులను విసిగిస్తున్న ఈ అవాంఛిత కాల్స్, సందేశాలకు అడ్డుకట్ట వేయాలని టెలికం సంస్థలను టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్ ఆదేశించినది తెలిసిందే.

వాహన ధరలు పెంచిన టాటా, కియా

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: వాహన ధరలను మరో రెండు సంస్థలు పెంచాయి. ఇప్పటికే మారుతి, హ్యుందాయ్, మహీంద్రాతోపాటు లగ్జరీ సంస్థలైన మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ తమ వాహన ధరలను 3 శాతం వరకు పెంచగా..తాజాగా ఇదే జాబితాలోకి టాటా మోటర్స్, కియాలు కూడా చేరాయి. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతో పాటు నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. టాటా మోటర్స్ తన ప్యాసింజర్ వాహన ధరలను జనవరి నుంచి అమలులోకి వచ్చేలా 3 శాతం వరకు సవరిస్తుండగా, అదే కియో వాహనధరలు 2 శాతం వరకు పెంచుతున్నట్లు తెలిపింది.

79 వేల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో పుత్తడి ధర రూ.79 వేల దిగువకు పడిపోయింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి రూ.190 తగ్గిన తులం ధర రూ.78,960కి దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.190 తగ్గి రూ.78,650గా నమోదైంది. కానీ వెండి ధరలు పెరిగాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.350 పెరిగి రూ.93,850 పలికింది. కానీ, హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర స్వల్పంగా రూ.160 పెరిగి రూ.77,780కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.150 అందుకొని రూ.71,300కి చేరింది. అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో ఎంసీఎక్స్ మార్కెట్లో బంగారం ధరలు పెరిగినప్పటికీ రిటైల్‌గా మాత్రం తగ్గుముఖం పట్టాయని ఆల్ ఇండియా సరాఫ్ అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,673 డాలర్లు పలుకగా, వెండి 32.19 డాలర్ల వద్ద ఉన్నది.

12 నుంచి ప్యాకాన్-2024 సదస్సు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ప్యాకేజింగ్ రంగం పురోగతి, భవిష్యత్తు అవసరాలపై ప్యాకాన్-2024 పేరుతో ఈ నెల 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించబోతున్నట్లు సీఐఐ తెలంగాణ ప్రకటించింది. రేపటి ప్రపంచ మార్కెట్ సవాళ్ల కోసం నేటి ఆవిష్కరణలు' అనే థీమ్‌తో ఏర్పాటుచేస్తున్న ఈ సదస్సుకు ఆ రంగానికి చెందిన నిపుణులు, ఆవిష్కర్తలు, వాటాదారులు.. పెరుగుతున్న మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేయాల్సిన నూతన ఆవిష్కరణలపై చర్చించనున్నట్లు సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి డీ ప్రసాద్ తెలిపారు. సుమారు 200మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సులో ప్యాకేజింగ్ రంగానికి చెందిన ఉత్పత్తులను కూడా ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

సింగరేణి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

ఎంపికైన ఉద్యోగులతో జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 9 : సింగరేణి కంపెనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సింగరేణి కంపెనీలో మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్) గా ఎంపికైన 20 మందికి భూపాలపల్లి ఏరియాలో పోస్టింగ్ ఇవ్వగా సోమవారం వారు జీఎంను కలిసి రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రక్షణ నియమాలు పాటిస్తూ ఉత్పత్తిని పెంచాలని ఆయన కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజీఎం కవీంద్ర, ఏజీఎం జ్యోతి. కేటీకే ఓసీ-2 పీవో టీ వెంకటరాం రెడ్డి, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఎస్టేట్ ఆఫీసర్ కార్తీక్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు అంకితభావంతో పనిచేయాలి

ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం అధ్యక్షతన అన్ని గనుల ముఖ్య అధికారులతో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం నిర్వహించారు. కంపెనీ స్థితి గతులు, ఉత్పత్తి, ఉత్పాదకత, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జీఎం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సింగరేణి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఎస్వోటు జీఎం కవీంద్ర, ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి, ఏజీఎం ఎస్. జ్యోతి, కేటీకే ఓసీ-2 పీవో వెంకటరాంరెడ్డి, ఏసీఎంవో పద్మజ, అన్ని గనుల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ గణనపై శిక్షణ

ములుగురూరల్, డిసెంబర్ 9 : జిల్లా కేంద్రంలోని రైతు వేదిక భవనంలో వ్యవసాయ విస్తరణ, మండల ప్రణాళిక, గణాంక అధికారులకు 11వ వ్యవసాయ గణన రెండో దశ క్షేత్ర స్థాయి సిబ్బందికి సోమవారం ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రణాళికా అధికారి ప్రకాశ్ హాజరై మాట్లాడుతూ పంటల వివరాలు, నీటి వనరులు, రైతుల సామాజిక ఆర్థిక పరిస్థితి, రుణాల సేకరణ, సాగులో అనుసరిస్తున్న పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగం, వ్యవసాయ యాంత్రీకరణ వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ములుగు డివిజన్ ఉప గణాంకాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదు

మొగుళ్లపల్లి, డిసెంబర్ 9 : రౌడీ షీటర్లు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదని ఎస్సై బీ అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని రౌడీషీటర్లకు ఆయన పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్లో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి

కాటారం, డిసెంబర్ 9 : మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని రామిళ్ల రాజబాపు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైన్స్ షాపుల్లో విక్రయిస్తున్న మద్యం ధరలు, స్టాక్ వివరాలపై సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసినట్లు చెప్పారు. అలాగే కాటారం పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని కోరినట్లు చెప్పారు. ప్రజావాణిలో సమస్యలపై దరఖాస్తు చేస్తే ఫిర్యాదుదారులను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

టేకుమట్ల, డిసెంబర్ 9 : షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన పోతుగంటి సమ్మయ్య ఇల్లు కాలిపోయింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. వెలిశాలకు చెందిన పోతుగంటి సమ్మయ్య హనుమకొండలో షాపులో పని చేస్తూ అక్కడే ఉంటుండగా, తల్లి ఇంట్లో ఉంటుంది. సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన షార్ట్ సర్క్యూట్‌లో ఇంటి పైన ఉన్న గడ్డికి మంటలు అంటుకున్నాయి. గమనించిన లక్ష్మి కొడుకుకు సమాచారం ఇచ్చింది. ఇంటి పైకప్పు, ఫ్యాన్, బియ్యం, రూ.10వేల నగదు, దుస్తులు కాలిపోయాయి. రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఆర్ఐ సంతోష్ పంచనామా నిర్వహించి తక్షణ సాయం కింద 50కిలోల బియ్యం అందజేశారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

చిట్యాల, డిసెంబర్ 9 : మండలంలోని నైన్‌పాక కాంప్లెక్స్ పరిధిలోని నైన్‌పాక ప్రైమరీ స్కూల్, అందుకుతండా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంఈవో కొడపాక రఘుపతి సోమవారం తనిఖీ చేశారు. ఆవరణ, మధ్యాహ్న భోజనం తయారీ, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గది బోధన పరిశీలించి విద్యా ప్రమాణాలపై సూచనలు చేశారు.

మహదేవపూర్ ఎంఈవోగా ప్రకాశ్‌బాబు

మహదేవపూర్, డిసెంబర్ 9 : మండల నూతన విద్యాధికారిగా స్థానిక ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రకాశ్ బాబు నియమితులయ్యారు. గతంలో పని చేసిన బొమ్మాపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇటీవల ఉద్యోగ విరమణ పొందగా ఆయన స్థానంలో ప్రకాశ్‌బాబు నియమించగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనకు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం బండం రాజిరెడ్డి, మడక మధు, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సీఆర్‌పీ మహేశ్, సీసీవో రాజు, స్వాతి, మెసెంజర్ చిర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేటీకే ఓసీ-3 ప్రాజెక్ట్‌లో భద్రతా పక్షోత్సవం

గణపురం, డిసెంబర్ 9 : కేటీకే ఓసీ-3 ప్రాజెక్టులో సోమవారం 55వ వార్షిక భద్రతా పక్షోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించగా మేనేజర్లు భాను ప్రసాద్, రాంబాబు, శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ భానుప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు మైనింగ్ ప్రదేశంలో భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. భద్రతా పక్షోత్సవం కార్యక్రమాలు ఉద్యోగుల భాగస్వామ్యంతో విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. యూనియన్ నాయకులు, అధికారులు భద్రతపై తమ అభిప్రాయాలు తెలిపి, ఉద్యోగులను ప్రోత్సహించారు.

దొడ్ల సమీపంలో అడవిలో చెట్ల నరికివేత

ఏటూరునాగారం, డిసెంబర్ 9 : మండలంలోని దొడ్ల సమీపంలోని కొత్తూరు గ్రామ శివారు క్రీడా మైదానాల పరిసరాల్లో ఉన్న అడవిని కొందరు నరికివేశారు. గత ఏడాది కొండాయి ప్రాంతంలో వరదలు గ్రామాన్ని ముంచెత్తగా 8మంది వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, వరద బాధితులు కొందరు ఇక్కడ ఇండ్ల స్థలాల కోసం అడవి, చెట్ల పొదలు నరికి వేసినట్లు తెలుస్తున్నది. నరికివేతకు గురైన అడవిని అటవీ శాఖ అధికారులు పరిశీలించినట్లు సమాచారం.

రైతులపై హమాలీ చార్జీలు మోపొద్దు

ములుగురూరల్, డిసెంబర్ 9 : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లోడింగ్ అన్ లోడింగ్ హమాలీ చార్జీలు రైతులపై మోపొద్దని రాష్ట్ర రైతు సంఘం, అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ కోశాధికారి గుండె బోయిన చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం మల్లంపల్లి, శ్రీనగర్, దేవనగర్ గ్రామాల్లోని సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైస్ మిల్లుల ఇన్‌చార్జిలను కలిసి మాట్లాడారు. ధాన్యానికి తరుగు పెట్టి ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. హమాలీ ఖర్చులు రైతుల చేత చెల్లిస్తున్నారని, వాటి డబ్బులను రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐకేపీ, సహకార సంఘాల సెంటర్ల నుంచి కాకుండా నేరుగా మిల్లు వద్దకు తీసుకువచ్చిన రవాణా చార్జీలను రైతులకు అందించాలన్నారు. ఆయన వెంట నాయకులు కామ రవి, రాస రాజన్న, బోయిని సాంబయ్య, ఇమ్మడి ప్రవీణ్, మెరు రవి ఉన్నారు.

కేజీబీవీ కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

తాడ్వాయి, డిసెంబర్ 9 : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట కేజీబీవీ కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నామని, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నామన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్, ఉద్యోగులతో పాటు సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో నేడు జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నామని తెలిపారు.

సెకండ్ ఏఎన్ఎంలతో అదనపు పనులు చేయించొద్దు

ములుగురూరల్, డిసెంబర్ 9 : జిల్లాలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలతో అదనపు పనులను చేయించొద్దని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఎలోసీడీసీ సర్వేలో రెండో ఏఎన్ఎంల పాత్ర లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ ర్యాలీగా డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లారు. అనంతరం కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆశ వర్కర్లు చేసే ఎలోసీడీసీ సర్వే పనులను ఏఎన్ఎంతో చేయించడంతో పని భారం పెరిగి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఇతర జిల్లాలో లేని విధానం ములుగులో ఎందుకని ప్రశ్నించారు. జిల్లా నాయకుడు ముత్యాల రాజు, జిల్లా అధ్యక్షురాలు సరోజన, ప్రధాన కార్యదర్శి కోడి సుజాత పాల్గొన్నారు.

తెలుగులో ఈ నెల 13న బ్రహ్మాండమైన విడుదల
PLV CREATIONS
RELEASING ON 13TH DEC
A Film By PL VIGNESH
ప్రణయగోదారి
PRODUCER LINGAIAH PARAMALLA
DOP : PRASAD EDARA | MUSIC : MARKANDEYA
EDITOR : KODAGANTI VEERSHITHA VENU | ART : VIJAYAKRISHNA | PRO : SAI SATISH
DESIGNER : TSS KUMAR
దేవి 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
మహాలక్ష్మి కాంప్లెక్స్ ఎ/సి - కొత్తపేట
లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట
PVR ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
PVR ఆర్.కె - బంజారాహిల్స్
PVR పెంట్లపేమాల్ - పంజాగుట్ట
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
PVR గలేరియా - పంజాగుట్ట
PVR పివిఆర్ - ఎర్రమంజిల్
PVR పివిఆర్ - మూసారంబాగ్
PVR ప్రెస్టన్ ప్లేమ్ - గచ్చిబౌలి
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి
PVR PRISM మాల్ - గచ్చిబౌలి
లులు మాల్ - కూకట్‌పల్లి
CCPL - మల్కాజ్‌గిరి
డి.ఎల్.ఎస్ - ఉప్పల్
మంత్రామాల్ - అత్తాపూర్
ముధ - శాలిబండ
అపర్ణ పినిమాస్ - వల్లగడ్డ
ఐనాక్స్ - బంజారాహిల్స్
జి.ఎస్.ఎమ్ - మనీనాగూడ
ఎం.పి.మాల్ - కాచిగూడ
పత్వనెక్సెస్ మాల్ - కాదిగూడ
అశోక ఎ/సి - వై.జంక్షన్
ఎఎంబి ఎ/సి - గచ్చిబౌలి
ఎఎఐ ఎ/సి - అమీర్‌పేట్
ఎఎంఆర్ - మౌలాలి
మూవీటైమ్ ప్లాటినమ్ - అమీర్‌పేట
మూవీటైమ్ ప్రైమాల్